క్లుప్తంగా

మాదన్నపేట పెద్దకాల్వ నీటి విడుదల



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువు యాసంగి కాల్వ తైబంది ఖరార్ చేసిన క్రమంలో ఆదివారం రైతులు, ఐబీ సిబ్బంది నీటిని విడుదల చేశారు. తొలుత చెరువు కట్టపై, మైసమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద కాల్వ, దుబ్బ కాల్వ నుంచి నీటిని విడుదల చేశారు.

బీజేపీలో చేరిక

చెన్నారావుపేట : మండలంలోని బాపునగర్‌కు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు బాదావత్ రాజు, బాదావత్ దల్లి, బానోతు లక్ష్మి, రాజి, ఇందిరమ్మ, మంగోలీ, వీరమ్మ, కైకి, భీమ్‌దేవ్, తదితరులు బీజేపీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారిని నర్సంపేట నియోజకవర్గ నాయకులు అభ్యర్థి కంభంపాటి పుల్లారావు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ కన్వీనర్ దామెరుప్పుల శేఖర్, మహిళా మోర్చా మండల ఉపాధ్యక్షురాలు బానోతు వీరమ్మ, నాయకులు పంజాల శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన నమిండ్ల సుష్మ స్వరాజ్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశం సాధించిన క్రమంలో ఆమెను గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు శాలువాతో ఆదివారం ఘనంగా సన్మానించారు. అలాగే ఎంబీబీఎస్ విద్యాభ్యాసం కోసం రూ.15 వేల సాయం అందజేశారు. ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షలో సుష్మ మెరుగైన ర్యాంకు సాధించి సీటు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్క కుమారస్వామి, అప్పని సదానందం, పత్తిపాక శేఖర్, తిప్పని సురేశ్, ముక్కెర పెద్దిరాజు, బిల్ల ప్రవీన్, మంద రమేశ్, నమిండ్ల పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతు అసోసియేషన్ కమిటీ ఎన్నిక


కుమారస్వామి


మల్లయ్య

చెన్నారావుపేట : మండల కేంద్రంలో శ్రీ రామ రైతు అసోసియేషన్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా అడప సత్తయ్య, ప్రధాన కార్యదర్శి మండల మల్లయ్య, కోశాధికారిగా దొంతి సతీశ్ గౌడ్, సభ్యులుగా చిరుతం రాజు, ఉప్పుల రాజు, చాపర్తి రాజు, వడ్లకొండ కుమారస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులను కార్యవర్గం అభినందించింది.

మాదిగ దండోరా కళాకారుల సంఘం కార్యవర్గం..


యాకయ్య


రవీందర్

మాదిగ దండోర కళాకారుల సంఘం నర్సంపేట నియోజకవర్గ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తాళ్ల సునీల్ మీడియాకు వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా పాపయ్యపేటకు చెందిన అబ్బదాసి యాకయ్య, కార్యదర్శిగా అమీనాబాద్‌కు చెందిన బరిగెల రవీందర్‌ను ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు యాకయ్య, రవీందర్ కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడి చికిత్స పొందుతుండగా ఆయనకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆదివారం రూ.10 వేల సహాయం పంపించారు. అలాగే కొమ్మాలకు చెందిన బొనగాని మల్లమ్మ, బట్టమేకల దూడమ్మ, గజ్జిమేకల కేతమ్మలు, ఎలుకుర్తి హవేలికి చెందిన ఐలోని భద్రయ్య, యాదగిరి, అక్కెల్లి స్వామి ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలకు బాలకిశోర్‌రెడ్డి రూ.5 వేల చొప్పున సాయం అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన డబ్బును బాధిత కుటుంబాలకు నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్ అందించారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

● మండల వ్యవసాయ అధికారి యాకయ్య





సంగెం : యాసంగిలో వరి సాగుకు మండల రైతులు సన్నద్ధం అవుతున్నారు. మండలంలోని ఎల్గూర్ రంగంపేట, గవిచర్ల, రామచంద్రాపురం, తిమ్మాపూర్, చింతలపల్లి, మొండ్రాయి, నల్లబెల్లి, కాపుల కనిపర్తి, ఆశాలపల్లి, తీగరాజులపల్లి తదితర గ్రామాల్లోని రైతులు చెరువులు, బోర్‌బావుల కింద వరి నారుమడులు సిద్ధం చేసుకుని విత్తనాలు విత్తుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు వరి నారు పోసి నాటు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో రైతులు నారుమడుల్లో పాటించాల్సిన మెళకువలు, చేపట్టాల్సిన యాజమాన్య చర్యలపై మండల వ్యవసాయ అధికారి సిహెచ్ యాకయ్య సూచనలు.

చలిని అధిగమించడానికి ..

యాసంగిలో పశువుల పేడ, గొర్రెల ఎరువు లేదా కోళ్ల ఎరువు రెండు క్వింటాళ్లు చల్లి దుక్కి చేసుకోవాలి. దమ్ము చేసిన తర్వాత నారుమడిలో కిలో విత్తనానికి 3 గ్రాముల చొప్పున కార్బండిజమ్‌ను నీటిలో కలిపి ధాన్యానికి పట్టించి ఆరబెట్టి విత్తనాలను నారుమడిలో చల్లాలి. రాత్రివేళ ఉష్ణోగ్రత 12 డిగ్రీల సెల్సియస్ కంటే తగ్గినపుడు చలి తీవ్రత పెరిగి నారు సరిగా ఎదగకపోవడం, కొన్ని సందర్భాల్లో నారు చనిపోవడం చోటు చేసుకునే అవకాశాలుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో రెండు గుంటల నారుమడిలో రెండు కిలోల చొప్పున నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాషియం ఇచ్చే ఎరువులను విత్తనం చల్లే ముందు సగం, నారు పోసిన తర్వాత 12–14 రోజులకు సగం చల్లాలి. చలి సమస్యను అధిగమించడానికి రాత్రి సమయంలో నారుమడిలో నీరు బయటకు తీసి ఉదయం నీరు పెట్టాలి. వీలైతే కర్రల సాయంతో నారుమడిపై టార్పాలిన్ షీట్లు లేదా ఎరువుల బస్తాలను రాత్రి పూట కట్టి ఉదయం తొలగించాలి. రబీలో వరినారుపై జింకులోపం ప్రభావం కనిపించే అవకాశాలున్న క్రమంలో దాన్ని అధిగమించడానికి 2 గ్రాముల చొప్పున జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నారు ఆరోగ్యంగా పెరగడానికి పైపాటుగా యూరియాకు 2 గ్రాముల కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ కలిపి చల్లాలి.

3న లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల సభ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రణయ్‌దీప్

నర్సంపేట : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 3న లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల సభ నిర్వహించనున్నట్టు ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ తెలిపారు. పట్టణంలో జిల్లా అధికార ప్రతినిధులు బొమ్మెర రవి, మెట్‌పల్లి కొమురయ్య సమక్షంలో జిల్లా అధ్యక్షుడు తాళ్ల సునీల్ అధ్యక్షతన సభ నిర్వాహక నియోజకవర్గ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్బదాసి యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా బరిగెల రవీందర్, కోఆర్డినేటర్‌గా మాంకాల సాంబరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా గోవిందు రాజేందర్, అధికార ప్రతినిధిగా గాదెపాక బాబు, ముఖ్య సలహాదారులుగా కన్నం వెంకన్న, కల్లెపల్లి ప్రణయ్‌దీప్, తడుగుల విజయ్, కట్ల రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా మేకల రాజు, నల్లబెల్లి మేఘం, మాదాసి బాబు, ధారా శంకర్, మంద సందీప్, యాకాంబ్రం, భిక్షపతి, ఇనుగాల రఘువరన్, సహాయ కార్యదర్శులుగా శ్రీశైలం, మునిగె యాకూబ్, పరికి లక్ష్మణ్, పులిగిల్ల సురేశ్, చిన్నపెల్లి లక్ష్మణ్, దిలీప్, ల్యాదల్ల హరీశ్, తూళ్ల యాకయ్య, సభ్యులుగా అలువాల మహేందర్, మాదాసి కుమార్, విజయ్, జీడి ప్రకాశ్, సారంగం, నవీన్, గ్యార సందీప్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రణయ్‌దీప్ మాట్లాడారు. మంద కృష్ణ ఆధ్వర్యంలో మాదిగ కళాకారులు అంతిమ పోరాటానికి సిద్ధం కావాలని, సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, కొమురన్న, రవి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ బలోపేతమే ధ్యేయం'



సంగెం : కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో ప్రచారం చేయాలని యూత్ కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ కోరారు. మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో ఇటీవల ఎన్నికైన యువజన నాయకుల పరిచయ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు అన్ని వర్గాల అభివృద్ధికి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. యువజన నాయకులు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా చొరవ చూపాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత పోటీ చేసి సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ నాయక్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అచ్చ వర్ష, నాయకులు అనిల్‌రెడ్డి, భరత్, సన్నీ, శ్రీకర్, రామకృష్ణ, నరేశ్, రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఖానాపురం : అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పెంతల అనూష (28) ఇంటి నిర్మాణం కోసం అప్పు చేసింది. ఆమె భర్త వెంకటేశ్ కూలీ పని చేసి సంపాదిస్తున్న డబ్బుతో అప్పులు తీరకపోవడంతోపాటు ఏటా వడ్డీ పెరుగుతుండడంతో మనస్థాపానికి గురైన అనూష ఈనెల 4న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

ప్రతిభను వెలికితీసేలా టాలెంట్ టెస్టులు


విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు

● ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

నర్సంపేట రూరల్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా టాలెంట్ టెస్టులు దోహదం చేస్తాయని బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని ఆ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి నవోదయ టాలెంట్ టెస్టును ప్రిన్సిపాల్ ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎలాంటి పరీక్షలనైనా విద్యార్థులు సమర్థవంతంగా ఎదుర్కొనేలా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. పరీక్షకు పాఠశాల నుంచి 239 మంది విద్యార్థులు హాజరవగా బానోత్ సాత్విక్ ప్రతిభ చాటి మొదటి బహుమతిగా రూ.3 వేల నగదుతోపాటు మెమోంటో అందుకున్నారు. అలాగే అభిరాంరెడ్డి, భరత్ చంద్ర రెండో బహుమతిగా రూ.2 వేల నగదుతోపాటు మెమోంటో దక్కించుకున్నారు. సుంకరబోయిన అక్షిత తృతీయ బహుమతిగా వెయ్యి రూపాయల నగదుతోపాటు మెమోంటో అందుకుంది. మరో 10 మంది విద్యార్థులకు మెమోంటోలు అందించారు.

విమానాశ్రయ ఏర్పాటుకు సహకరించాలి

● డీఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకరించి పూర్తి చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో రాష్ట్ర కార్యదర్శి కంజర్ల సమ్మయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని పెద్దపల్లి, కొత్తగూడెం, మెదక్, ఖమ్మం జిల్లాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతోపాటు బడ్జెట్ కేటాయించాలని ఆకాంక్షించారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో వరంగల్ జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. మామునూరు విమానాశ్రమం ఏర్పాటైతే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అందించేందుకు కేంద్రం సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు గబ్బెట బాబు, చినపెల్లి బాబు, వేణు, మధు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు చిదుముల్ల అనిఫ్ తల్లి బుచ్చమ్మ అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఆమె మృతదేహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు పోశాల వెంకన్న, బుచ్చిమల్లు, భాస్కర్, నిరంజన్, నర్సింహాచారి, గంగరాజు, రాజబాబు, కుమార్, నాగరాజు, ఉప్పలయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

ఖిలా వరంగల్: ఆరె కటికల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని ఆరె కటిక సమాజ్ జాతీయ నాయకుడు రావుల బాలరాజు కోరారు. వరంగల్ రంగశాయిపేటలో ఆరె కటిక సంఘ 16వ వార్షికోత్సవ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి సంఘాలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో రావుల ప్రవీణ్, డాక్టర్ మధు, రావుల రాజ్‌కుమార్, రావుల మహేష్, రాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో మోసాలు, నేరాలకు చెక్


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై రాజు

వర్ధన్నపేట : ప్రజలు అప్రమత్తంగా ఉండడం ద్వారా ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలకు చెక్ పెట్టొచ్చని స్థానిక ఎస్సై మెరుగు రాజు చెప్పారు. పట్టణంలో ప్రజలకు పలు అంశాలపై ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత ఆన్‌లైన్ గేమింగ్‌లకు ఆకర్షితులు కావద్దని సూచించారు. అపరిచితుల నుంచి ఫోన్ కాల్ వస్తే జాగ్రత్తగా మాట్లాడాలని చెప్పారు. ఎవరికి కూడా వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, తదితరాలు వెల్లడించొద్దని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నానాటికీ సైబర్ నేరగాళ్ల విధానాలు మారుతున్నాయని తెలిపారు. నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా మోసపోయినట్లు భావిస్తే వెంటనే 1930తోపాటు 100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని కోరారు.

రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ఖిలా వరంగల్ : రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, యాక్ట్ 2864ను సవరించాలని హైకోర్టు అడ్వకేట్ మురారిశెట్టి యశ్వంత్‌కుమార్ సూచించారు. శివనగర్ రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య కార్యాలయంలో సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ అధ్యక్షతన ఆర్ఆర్ యాక్ట్ న్యాయ సమీక్షా సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మొత్తం 3,388 రైస్‌మిల్లర్లలో 1,177 మిల్లర్లు ప్రభుత్వ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా అమ్ముకొని మోసగించిందాయని, అలాంటి మిల్లుల యజమానులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రభుత్వ ఆస్తి అని అన్నారు. మొగిలిచర్ల సుదర్శన్ మాట్లాడుతూ బ్లాక్‌లిస్టులో పెట్టిన మిల్లులకు రెండోసారి ధాన్యాన్ని మిల్లులకు ఇచ్చిన అధికారులపై కూడా చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆనందరావు, బండి అనిల్‌కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్


పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ పద్మ ప్రసాద్

నర్సంపేట : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పదో వార్డు కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఆ వార్డులో తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వరంగల్ రోడ్డులోని పోచమ్మ ఆలయం ఏరియా, వివేకానంద కాలనీ, ఫారెస్టు ఆఫీస్ వెనకాల, శివనగర్ ఏరియాలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టడానికి టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యి అగ్రిమెంట్ అయిన క్రమంలో అధికారులు త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తండా రమేశ్, మాదారపు ఈశ్వరయ్య, మామిడాల భిక్షపతి, పుట్ట సాంబమూర్తి, పుట్ట రవికుమార్, బండి సుధాకర్, శ్రీధర్ కిరాణం, కొడకండ్ల నాగేశ్వరరావు, వెంకటేశ్వరావు, శేర్ల శ్రీనివాస్, పస్తం కృష్ణ, మణికంఠ వేణు, సాంబమూర్తి, వీరన్న, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు భృతి చెల్లించాలి

● వ్యకాస జిల్లా ఉపాధ్యక్షురాలు శారద


సమావేశంలో మాట్లాడుతున్న శారద

చెన్నారావుపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు భూమిలేని పేద వ్యవసాయ కూలీలకు నెలకు రూ.12 వేల చొప్పున భృతి చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మొగులోజు శారద డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ పథకం కింద ఏడాదిలో 100 రోజుల పని పూర్తి చేసిన వారికి మాత్రమే భృతి ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడం లేదని, ఈ పరిస్థితిలో ఏటా 100 రోజులు పని చేసిన వారికే భృతి ఇవ్వాలని నిర్ణయించడం పేదలను మోసగించడమేనని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు మోసపూరిత మాటలతో కాలం వెల్లబుచ్చుతున్నాయని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు ఏనుగుతల నరేశ్, చంద్రకళ, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


1983-84 బ్యాచ్ విద్యార్థులు

దుగ్గొండి : ఎక్కడెక్కడో పుట్టారు. ఒక్కచోట చేరారు. చదువులమ్మ ఒడిలో పదేళ్ల పాటు కలిసి చదువుకున్నారు. అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ చిన్ననాటి నదువుకున్న స్కూల్‌లోనే కలుసుకున్నారు. మండలంలోని నాచినపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1983–84, 1985–86 విద్యాసంవత్సరాల్లో పదోవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి తరగతి గదులలో కూర్చుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలని, శేషజీవితంలోనూ కలిసి మెలిసి ఉండాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు నాతి మోహన్, జనార్దన్‌రెడ్డి, రాజమల్లు, రాజేశ్వర్‌రావు, జగ్గునాయక్, ఇంద్రసేనారెడ్డి, పొన్నం మొగిలి, ఆరె సుదర్శన్‌రెడ్డి, పెండెం తిరుపతి, ఓరుగంటి తిరుపతి, గుడిపెల్లి ధర్మారెడ్డి, అమ్మ కుమారస్వామి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, రవి, వీరారెడ్డి, మల్లన్న, రక్కిరెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెలూన్‌లో లీడ్ మినీ లైబ్రరీ ఏర్పాటు


సెలూన్‌లో పుస్తకాలు అందజేస్తున్న రవికుమార్

నర్సంపేట : లీడ్ గ్రామీణ గ్రంథాలయ వ్యవస్థాపకుడు, కవి కాసుల రవికుమార్ కుమారుడు వివేక్ ఆదిత్య జన్మదినం సందర్భంగా నర్సంపేటలోని సుప్రీం సెలూన్‌లో లీడ్ మినీ లైబ్రరీని ఏర్పాటు చేశారు. సెలూన్ నిర్వాహకుడు రాముకు రవికుమార్ పుస్తకాలు అందజేసి మాట్లాడారు. గ్రంథాలయ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం కలిగించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో, గ్రామాల్లో, ఇళ్లలో గ్రంథాలయం ఉండాలని ఆకాంక్షించారు. బాల్యం నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలని సూచించారు. ప్రతి చోట పుస్తకాల ప్రాధాన్యతను ఎలుగెత్తి చాటాలని కోరారు. కార్యక్రమంలో కాసుల వివేక్, సాహితి సిరి, ఎర్రబోయిన రాజశేఖర్, రవికాంత్, హైమద్, శ్రావణ్, శ్రీనివాస్, శ్రీను, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


అంజలి

నర్సంపేట : పట్టణంలోని మైనార్టీ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని కొత్తకొండ అంజలి సీఎం కప్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. హన్మకొండలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఐదు రౌండ్లకు గాను నాలుగు రౌండ్లలో ఆధిక్యత సాధించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించింది. అంజలి ఈనెల 30, 31 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ శ్రీపాల మీడియాకు ఆదివారం వెల్లడించారు. అంజలిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలోనూ ప్రతిభ చాటి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఖోఖో పోటీలకు..


స్పందన

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థిని స్పందన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు ఆమెతోపాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నను హెచ్ఎం తేజావత్ జయ ఆదివారం అభినందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడారు. స్పందన జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోశ్ కుమార్, పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మాధవి, మొగిలి, సుందర్, మాధవి, సతీశ్‌కుమార్, రమాదేవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.